


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మా జీవ్స్

**పి.జీ. ఉడ్ హౌస్** నవలలు చదివే వాళ్ళకి ఎవరికైనా జీవ్స్ అన్న పాత్ర చిరపరిచితం. లార్డ్ ఎమ్స్వర్త్ దగ్గర పనిచేసే బట్లర్. ఇతనికి ఏ విషయం గురించైనా అపారమైన జ్ఞానసంపద. ఇదంతా యజమాని ముందు వలకబోస్తుంటాడు.

ఇందుకు ఏమీ తీసిపోడు మా డ్రైవర్ కుమార్. (తన అసలు పేరు కొమరెల్లి. బస్తీకొచ్చి స్టైల్‌గా కుమార్ అని మార్చుకున్నాడు.) కుమార్‌కి అన్నీ తెలుసు అని మా 'లార్డ్' అభిప్రాయం. అంటే మా ఆయనండోయ్.

ఉదాహరణకి వాళ్ళిద్దరి సంభాషణా ఇలా వుంటుంది

"కుమార్ ఈ మెట్రోలైన్ ఎప్పుడు పూర్తవుతుందిరా?"

కుమార్ తడుముకోకుండా "ఇంకో ఆర్నెల్లు పడ్తుంది సార్"

మా లార్డ్‌కి ఒళ్ళుమండుతుంది "ఆర్నెల్లు ఎందుకురా? బుద్ధిలేని గాడిదా.. అంత పనేం వుందనీ?"

"ఉంది సార్.. మీకు కనపడ్త లేదూ"

"ఒళ్ళు తప్ప బుద్ధి పెరగని నీలాంటి వాళ్ళని పెట్టుకుంటే ఇంతే.. ఛ! ఈ దేశం ఎటు పోతోందో?"

"సార్... కోప్పడ్తారు ఎందుకు? ఇంకో ఆర్నెల్లు ఓపిక పట్టండి"

"ఆర్నెల్లకి కాకపోతే నీ సంగతి చెప్తా! స్టుపిడ్!"

ఈ సంభాషణ మొత్తం వింటుంటే నాకు మతిపోతుంది. కుమార్‌కీ ఈ ఆర్ అండ్ బీ వర్క్స్‌కీ సంబంధం ఏవిటీ? లేదా వీడేమైనా కే.సీ.ఆర్‌కి కుడిభుజమా? అయినా ఆయన తిడ్తారని తెలుసుకదా!

"ఈ మెట్రోలైన్ ఎప్పుడు పూర్తి అవుతుందీ?"

అనగానే వీడు "తెలియదు సార్" అనచ్చుగా. చచ్చినా అనడు. అన్నీ తెలిసిన అఖండ జ్ఞానిలా అవదని వాదిస్తాడు.

"ఎండలు ముదిరాయి. ఇంక రోహిణీకార్తె వస్తే చల్లబడ్తుంది" అని మా అమ్మ అంటే వీడు స్టీరింగ్ మీదనుండి తల తిప్పి "పడదు" అంటాడు.

వాతావరణ శాస్త్రజ్ఞుడిలా బోలెడు థియరీలు చెప్తాడు.

"ఆవకాయ పెట్టొచ్చు... టెంక పట్టింది" అని మా ఆడబిడ్డ అంటే "ఇంకా లేదు. మిర్గం(మార్గశిర) వెళ్ళాల" అంటాడు కారు కడుగుతూ.

నేనూ మా ఉమా వెనక సీటులో కూర్చుని మాట్లాడుకుంటుంటే, పాటలు వాల్యూం తగ్గించి మరీ మా మాటలు వింటూ సంభాషణలో పాలుపంచుకుంటాడు.

"మా ఎదురు ఫ్లాట్ ఆవిడ మళ్ళీ ఇంకో ఫ్లాట్ కొందే" అంటే ఉమ.

"ఎవరిది వాళ్ళకే వుంటుందమ్మా. వాళ్ళది మనకొస్తుందా? మనది వాళ్ళకొస్తుందా?" అంటాడు వీడు.

"నువ్వు డ్రైవింగ్ చెయ్యి సలహాలివ్వకు" అంటాను నేను.

వీడివల్ల అపార్థాలు కూడా వస్తుంటాయి ఒకొకప్పుడు.

షూటింగ్ లొకేషన్‌లో ఓసారి "నాగుబాబు సార్‌ని కలిసి మందలించి వస్తా.. వుండమ్మా" అన్నాడు.

'ఆయన్ని నువ్వు మందలించడం ఏవిట్రా? ఏం చేసారనీ?' అని నోరు తెరిచేసా.

"అబ్బా.... సార్ నమస్తే... బాగున్నారా? అని మందలించొస్తా" అన్నాడు.

మందలించటం అంటే పలకరించడం అన్నమాట.

ఓసారి అమెరికా నుండి మా కాంతికిరణ్‌గారొస్తే వీడికి తెగ మర్యాద చెయ్యాలన్న బుద్ధిపుట్టి, కార్లో డబ్బాలో వున్న దానిమ్మగింజలు ఇచ్చి "బుక్కుతవా?" అన్నాడు.

"అదేం అడగడంరా? మర్యాద లేకుండా?" అని తిడ్తే, తప్పు తెలిసి "బొక్కుతారా?" అని మళ్ళీ అడిగాడు పాపం.

ఇంక మా ఆయన విషయానికొస్తే, కుమార్‌తో చర్చించనిదే ఏ సమస్యా ఆయనకి తోచదు. "కుమార్ నేను రిటైర్ అయ్యాక పెద్ద పెద్ద వాషింగ్ మిషిన్స్ పెట్టి లాండ్రీలు పెడ్దాం అనుకుంటున్నా. ఏవంటావ్?" అంటారు.

"ఒద్దు సార్.. తాడీ షాపులు పెడ్దాం" అంటాడు విజయ మాల్యాలా ఫీల్ అయిపోతూ.

మా ఆయన కోపంగా " ఆ తాడి చెట్లవల్లేగా మీ నాన్నకి కాలు తీసేసారు. ఇంకా నీకు ఆ వ్యాపారం మీదే మనసా?" అంటారు.

"ఇ.సి.యల్‌లో బాయిలర్ పేలి ఆ పెద్దాయన పోతే, ఆయన పిల్లగాడికి ఆ ఉద్యోగం ఇవ్వలే? ఆ పిల్లగాడు భయపడ్డాడా?" అంటాడు కుమార్.

తాడి చెట్టు ఎక్కుతుంటే, కాలికి దెబ్బ తగిలి షుగర్ వల్ల అది సెప్టిక్ అయి కుమార్ తండ్రికి కాలు తీసేసారు పాపం.

"పోనీ నీళ్ళ వ్యాపారం చేద్దాం" అంటారు ఈయన.

"మనకి కృష్ణా వాటర్ వచ్చేస్తోంది. నీళ్ళకి కరువు వుండదు" అంటాడు వీడు.

"ఎక్కడొచ్చాయిరా?" అని అరుస్తారు ఈయన.

"లైన్లు ఏపిస్తున్నారు.."

"ఎంతకాలం పడ్తుంది?"

"ఆర్నెల్లు"

"నీ ఆర్నెల్లు తగలడా? త్వరగా చేయించు"

ఇంక నేను వూర్కోలేను " ఏవిటండీ మీరూ? వాడికేం తెలుసు ఎప్పుడు పూర్తి అవుతుందో?"

"మరి ఖాళీగా వున్నప్పుడు తిరిగి తెలుసుకోమను" ఈయన శాసనం.

"అసలు అమ్మ నన్ను ఖాళీగా పెడ్తేగా?" వాడి అభియోగం.

"ఇదిగో మీ అమ్మ పిలవకపోతే లంచ్ టైం దాకా చూసి నువ్వు నేను చెప్పినట్లు మున్సిపాలిటీ పనులు ఎప్పుడు అవుతాయో వెళ్ళి కనుక్కో" అంటారు.

"అమ్మ పిలిస్తే? అసలే అరవింద్ సారూ, నాగుబాబు సారూ సడెన్‌గా పిలుస్తారు" అంటాడు బాధ్యతగా.

"పిలిస్తే కేబ్‌లో వెళ్తుందిలే" ఈయన సలహా.

"ఏడ్చినట్టుంది. పనిలేని మంగలి పిల్లి తల గొరిగాడని నా డబ్బులొచ్చే పనులు మానుకుని వాడ్ని ఆ బేవార్సు పనులకి తిప్పుతారా?" అని నేను 'కయ్' మంటాను.

"మనిషన్నాకా కొంచెం ఎవేర్‌నెస్ వుండాలోయ్. చూడు జనం నీళ్ళ కోసం ఎన్ని తిప్పలు పడ్తున్నారో? వాటర్ ట్యాంకర్ బుక్ చేస్తే వారం దాకా రావటంలేదు" అంటారు ఈయన.

"అవును. హుస్సేన్ సాగర్‌లో నీళ్ళు లేవు" కుమార్ జవాబు.

"అసలు చెట్లు కొట్టించడం వల్ల ఇదంతానూ. పర్యావరణ కాలుష్యం. కుమార్ ట్రీ గార్డ్స్ తెచ్చి ఇంటిముందు చెట్లు నాటించూ" లార్డ్‌గారి హుకుం.

"ఎదురింటామె దినాం కొట్లాడ్తుంది. ఆకులు రాలితే. నేను వెయ్యను"

అపుడే వీడు అశోక చక్రవర్తిలా చెట్లు నాటించడం అవి మహావృక్షాలై ఆకులు రాల్చడం. ఎదురింటావిడ తిట్టడం. అన్నీ అయిపోయాయి. ఒరేయ్ చెట్లు లేకపోతే లోకం పుచ్చిపోతుదిరా. ది వరల్డ్ ఈజ్ గోయింగ్ టు డాగ్స్"

"అవును సార్ కుక్కలు ఎక్కువయినాయి"

"మరి బల్దియా వాళ్ళకి చెప్పకపోయావా?"

"ఎన్ని పనులని చెయ్యాలి సార్?"

నాకు మళ్ళీ ఒళ్ళు మండుతుంది "అసలు ఎన్ని పనులు చేస్తున్నావు అని? వారంలో రెండుసార్లు పిలుస్తాను. నెలలో నాలుగు ఆదివారాలు శలవలు. మళ్ళీ మధ్యలో ఎంతోమంది నాయనమ్మలూ, తాతలు పోతుంటారు. అవి లేకపోతే ఒడిబియ్యాలూ, సమ్మక్క జాతరలూ, కొమరెల్లికి 'ఏట'లూ అని పదిరోజులు శెలవు పెడ్తావు" అన్నాను.

వీడి కబుర్లు ఎలా వుంటాయి అంటే, "మా సెల్లెకి కొడుకు పుట్టిండు. సోమవారం డిన్నర్‌కి పోవాలె మేడం" అంటాడు.

"ఇప్పుడు బిడ్డని కనే వయసులో వున్న చెల్లి ఎక్కడినించి వచ్చిందిరా?" అంటాను.

"మా నాయనమ్మ యారాలు, ఆడబిడ్డకి మేనమామ పెళ్ళాం చెల్లెలి మనుమరాలుకి ఈమె ఆడబిడ్డ మేడం. మా 'సంతం' నాయనమ్మకి" అని సంతం అన్నమాట వత్తి పలుకుతాడు.

'సంతం' అనగానే బ్లడ్ రిలేషన్ అయిపోతుందన్నమాట, చుట్టరికం ఎంత దూరం అయినా.

ఇంకా ఈ 'సంతం' ముదిరి, మొన్న డుమ్మా కొట్టాడు. "ఎక్కడికెళ్ళావ్?" అనడిగా.

"మా వీధి చివర కిరాణాషాపు ఆయన లేడూ!? ఆయన కూతురి ఆడబిడ్డ మరిది షడ్డకుడి చెల్లె పెళ్ళి. మా వీధిలో ఈయన 'సంతం' షాపు నడుపుతూ పదేళ్ళ సంది తెలుసు.. 'సంతం' మా వీధే" అన్నాడు.

"ఈ సొంతం తగలడా? అది సొంతం వీధేమిట్రా? చెన్నైలో ఎస్.పిబి అని వీధి పేరు వుంది కానీ అది ఎస్.పిబిది కాదు. అంతెందుకు మన డా.ఏ.ఎస్.రావ్ నగర్‌లో ఏ.ఎస్.రావుగారు ఓ సారి బస్ ఎక్కి తన స్టేజ్‌లో ఆపమంటే "నీ అయ్యదా ఆ స్టేజ్?" అన్నాడట కండక్టర్.

"కాదు బాబూ. కానీ నా పేరు పెట్టారు పాపం" అన్నాడట ఆయన అమాయకంగా. వాళ్ళే అనరు మా 'స్వంతం' అని. నువ్వెలా అంటావురా?" అన్నాను.

"మీ వూరేది అంటే 'రాజమండ్రి' అంటారు. అంటే వాళ్ళు దాన్ని కొన్నట్టా?" లా పాయింట్ లేవనెత్తాడు.

అవును. ఓసారి వీధిలోకొచ్చిన ముష్టతనికి అన్నం పెడుతూ "ఎక్కడ్నించి వచ్చావు?" అన్నాను. అన్నం, పులుసూ తన జోలెలో వేసుకుంటూ "మాది భీంవరం అండీ. ఈ వూరు బుద్దిగడ్డి తిని వచ్చాను. నా వూళ్ళో తిండీ, ఆ గాలీ, ఈడ ఏడుందండీ? పెద్ద పెద్ద బిల్డింగుల్లో మీరంతా మంచాల్లో నల్లుల్లా బతుకుతున్నారండీ" అన్నాడు వాడు.

అవాక్కయ్యాను.

అతనిది భీం వరం. మాది నల్లులు పట్టిన మంచం.

అసలు మా కుమార్ నేనేం చెప్పినా వెంటనే తన అమూల్యమైన అభిప్రాయాలు వెలిబుచ్చకుండా, చెప్పిన పని చెయ్యడు. "మంగళవారం నాడు రేడియో స్టేషన్‌కి వెళ్ళాలి" అంటే "బుధవారంనాడు సెన్సార్ ఆఫీస్‌కి వెళ్ళాలి అన్నావుగా. ఆ దినం పోదాం తీ" అంటాడు.

"అరె. మంగళవారం నాడు రేడియో ప్రోగ్రాం వుందంటే బుధవారం పోవాలంటావేంట్రా?" అంటే

"అటుపోయినప్పుడు అపొలోలో 'డాక్టర్' సాబ్‌ని మందలించి పోదాం అంటాడు"

మా డాక్టర్ నాయక్ గారి గురించి వీడి ముచ్చట ఏంటంటే ఉచితంగా ఏదో చెకప్ కావాలన్నమాట.

ఇంకా తమాషా! "నువ్వు మేలో అమెరికా పోయి, జూన్‌లో వస్తున్నావు మరి అరవింద్ సార్, చిరంజీవిగారి తోటలో మామిడిపండ్లు ప్రతిసారిలాగా పంపిస్తాడు అని మా బామ్మర్ది పిల్లలకి చెప్పినా. నువ్వు లేకపోతే నాకైనా ఇమ్మని చెప్పిపో" అన్నాడు.

ఆ అనడంలో ఎంతో నమ్మకం, ఆత్మబలం కనిపించి నవ్వొచ్చింది. "అలాగే చెప్తాలే" అన్నా.

సడెన్‌గా ఓ రోజు ప్రేమ పొంగుకొచ్చి "మేజర్ సాబ్ వచ్చి చానా దినాలయింది చూడాలని వుంది రమ్మను" అంటాడు. మేజర్ సాబ్ అంటే నా మేనల్లుడు.

"ఏరా పార్టీ ఏదైనా వుందా? మిల్రిటీ క్యాంటిన్‌లో మందు కావాలా? " అంటే, "మేడంకి అన్నీ తెలిసిపోతాయి" అని కిచకిచ నవుతాడు.

ఒక్కోసారి "అమ్మకి వెల్లంకి నుండి నువ్వులేసిన అరిసెలు తెచ్చిపెడ్తా. చాలా దినాలు అయింది. డబ్బులియ్యి" అంటాడు. మా అమ్మ మీద అంత ప్రేమ ఎందుకంటే, వీడికి అక్కడ అమ్మే 'జున్ను' తినాలని వుందన్నమాట.

అమ్మని తీసుకొచ్చినప్పుడు దార్లోనే "పప్పు పులుసు పెట్టినప్పుడు నన్ను యాది మరవకు" అంటాడు. ఆవిడ చేతి పప్పుచారు ఇష్టం.

మా అబ్బాయి పెళ్ళి సంబంధాల విషయంలో కూడా తన అమూల్యమైన అభిప్రాయాలు వెళ్ళగక్కుతాడు.

"ఆంధ్రాలో చూడకమ్మా.. సార్ అత్తగారి ఇంటికి మాటికి పోలేడు ఎండలు" అంటాడు. ఎక్కడ తను వెళ్ళాల్సొస్తుందో అని.

ఎప్పుడైనా మా కారు మా అబ్బాయి తీసుకెళితే మర్నాడు యాదాలాపంగా అడిగినట్టు "రాత్రి మేడంని ఏడ దింపినవు?" అంటాడు.

వాడు ఉలిక్కిపడి "ఏ మేడం?" అంటే "మీ కారు వదిలి మా కారు తీసికెళ్ళినవు కదా ఎవరైనా గర్ల్ ఫ్రెండ్‌తో ఎళ్ళినా? ఏంది ముచ్చట అని అడిగినా?" అంటాడు.

ఇంక భోజనం విషయంలో మా 'జీవ్స్' ఒకంతట సంతృప్తి పడడు.

మినిస్టర్ గారి ఇల్లైనా సరే, భోజనం చేసి బయటకొచ్చి "అన్నం దొడ్డు దొడ్డు వుంది. బియ్యం బాగలేవు" అంటాడు. వీడిని క్వాలిటీ కంట్రోల్ చీఫ్‌ని చెయ్యచ్చు. "అప్పుడోసారి ఫలానా వాళ్ళింట్లో తిన్నామే రెండువేల పన్నెండులో ఆ రైస్ బాగుంది" అంటాడు బాగుంటే ఎప్పటికీ మర్చిపోడు.

కోపంతో ఎన్ని తిట్టినా నవ్వుతాడు. జోక్ వేస్తే నవ్వుతాడు. అందుకే నాకు కుమార్ అంటే ఇష్టం.

అంతేకాదు తన యాసలో చక్కని మాండలీకం మాట్లాడ్తాడు. "మా ఊళ్ళో రెండు కాలాలు పోయినాయి. అందుకే యవసాయం మానేసి ఈడకొచ్చి స్టీరింగ్ చేతబట్టినా" అంటాడు.

"రెండు కాలాలు పోడం" అంటే రెండేళ్ళు వానలు పడకపోవడం అన్నమాట. నిజం కదా! వాన లేకపోతే మనం లేము. ఆ వానలు పడడానికి కారణం అయ్యే వృక్షాలని మానవుడు సునాయాసంగా నరికించేస్తాడు. ఈ కాంక్రీట్ వనాల్లో మనం మంచాల్లో నల్లుల్లాగే బతుకుతున్నాం. ముష్టోడు అయినా గట్టిమాట చెప్పాడు.

మా ఆయన ఒక రోజు టెలిఫోన్ డెడ్ అయింది. చెట్టు కొమ్మలతో బాటు కేబుల్స్ కట్ చేసారని కోప్పడ్తున్నారు.

"ఇంకో రెండు దినాల దాకా శలవలు. ఫోన్ బాగు అవదు" అన్నాడు.

"అవ్వాలిరా. వైఫై కూడా బి.ఎస్.ఎన్.ఎల్ కనెక్షన్. త్వరగా చేయమను" అని ఈయన అరుస్తున్నారు.

"కుదరదు" అన్నాడు కుమార్.

వంటగదిలో కందిపప్పు వేయిస్తున్న నేను "వాడేమైనా మేయరా? మునిసిపల్ కమీషనరా? ఏరా ఎందుకురా తిట్లు తింటావ్? నాకు తెలీదు సార్ అని ఒక్క మాట అనొచ్చుగా" అన్నాను

"నాకు తెలుసు" అన్నాడు ధీమాగా.

"రేయ్ ఈడియెట్ ఏ పనీ కంప్లైంట్ ఇవ్వగానే చెయ్యరు. అందుకే ప్రభుత్వం, ఈ దేశం ఇలా తగలడింది" మా ఆయన దండకం అందుకున్నారు. వాడు తిట్లు తింటున్నాడు. తిట్లయినా తింటాడు కానీ తనకి 'తెలియదు' అని మాత్రం ఏ విషయం ఒప్పుకోడు.

నేను మా ఆయన్ని తర్వాత అడిగాను "ఎందుకండీ వాడిని అస్తమానం తిడ్తారూ? వాడు చదువుకోలేదు. ఏ విషయం పూర్తిగా తెలియదు. ఏదో నోటికొచ్చినది మాట్లాడ్తాడు. వాడికి అన్నీ తెలిసినట్లు వాడిని అడుగుతారేమిటీ?" అని.

ఆయన నవ్వేసారు. "పిల్లలు పెద్దాళ్ళై వెళ్ళిపోయారు. వచ్చినా మనతో మాట్లాడే టైంలు వుండవు. మరి ఏం చెయ్యమంటావ్? మాట్లాడేవాడిని మాట్లాడించాలి కదా!"

"హూ! ఇదా మీ టైం పాస్?" అని నిట్టూర్చా.


అవును దగ్గర లేని వాళ్ళని తలచుకోడం కన్నా దగ్గరైన వాళ్ళతో కాలక్షేపం చెయ్యడమేగా జీవితం.

ఒక్కోసారి కవిత్వం మాట్లాడ్తాడు మా కుమార్. అమ్మ మా ఇంటికొచ్చి వారం గట్టిగా వుంటే అన్నయ్యని చూడాలని దిగులు మొదలు. ఏదో కారణం చెప్తుంటుంది "బి.పి చూపించుకుని వస్తా శర్మగారి దగ్గర" అనో, "టైలర్ దగ్గర జాకెట్లు వుండిపోయాయి అనో" అలాంటప్పుడు కుమార్ దింపడానికి వెళ్తాడు. **"సందు చివర మీ అన్న కనపడగానే దీపావళి రోజు చిచ్చుబుడ్డిలాగా వెలిగింది అమ్మ మొగం" అంటాడు. ఇంకోసారి "సాయంకాలం పూసే చంద్రకాంత లెక్క ఇచ్చుకుంది మొగం"** అంటాడు.

**ఎంతైనా నా డ్రైవర్ కదా మరీ!**

COMMENTS


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


సాహితి
కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి